క్లుప్తంగా

సదయ్యకు డాక్టరేట్



కేయూ క్యాంపస్ : హనుమకొండకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సదయ్యకు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో సైకాలజీ విభాగంలో డాక్టరేట్‌ను ప్రకటించింది. సైకాలజీ విభాగంలో పరిశోధకుడిగా జాబ్ స్యాటిస్‌ఫాక్షన్ ఇన్ రిలేషన్ టు సైకాలజీ వెల్‌బీయింగ్ సెల్ఫ్ ఎఫికసీ అండ్ పర్సనల్ స్ట్రెయిన్ అమాంగ్ హైస్కూల్ టీచర్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సదయ్యకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు ఓయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రఘు తెలిపారు. జాతీయ పోషకాహార సంస్థ హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ సిల్వియా ఫెర్నాండేజ్ రావ్ పర్యవేక్షణలో సదయ్య తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

నేత్రదానం మహాదానం

మడికొండ : నేత్రదానం చేస్తే ఇద్దరు అంధులకు చూపునిచ్చిన వారమవుతామని వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల, ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి సిబ్బంది నేత్ర సేకరణ నిపుణులు నరేందర్ అన్నారు. కాజీపేట మండలం మడికొండ సాయినగర్‌కు చెందిన మంత్రవాది వెంకటసుబ్బారావు (80) సోమవారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. వారి కుటుంబ సభ్యులు సమాజహితం కోసం నేత్రదానం చేయడానికి ముందుకు వచ్చారు. లయన్స్ క్లబ్ మడికొండ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆవాల నరోత్తమ్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాలకృష్ణ, అమర్నాథ్, ప్రవీణ్, డాక్టర్ దామోదర్, అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, పాల్గొన్నారు.

రేపటి నుంచి సమ్మె

హసన్‌పర్తి: రాష్ట్రవ్యాప్త సమ్మెకు పంచాయతీ ఉద్యోగులు పిలుపునిచ్చారు. ఈనెల 6 నుంచి సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు. మంగళవారం హసన్‌పర్తి పంచాయతీ ఉద్యోగుల మండల జేఏసీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ రామకృష్ణకు నోటీసులు అందజేశారు. అనంతరం పంచాయతీ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కోశాధికారి, తెలంగాణ గ్రామపంచాయతీ కారోబార్, బిల్ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతళ్ల సదానందం మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ ఉద్యోగుల జేఏసీ మండల అధ్యక్షుడు బండి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

లీకేజీలకు మరమ్మతులు

ఖిలా వరంగల్ : వరంగల్ 38వ డివిజన్ ఖిలా వరంగల్ పడమరకోటలో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీలతో తాగునీరు వృథాగా పోతుంది. రహదారి బురదమయం కావడంతో రాకపోకలకు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు.ఈ సమస్యను కార్పొరేటర్ బైరబోయిన ఉమ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆమె స్పందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జి.సాంబ రెడ్డి, వరంగల్ టౌన్ డీఈ ఎస్. మల్లికార్జున్ తెలిపారు. హనుమకొండలోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, స్పెక్ట్రా స్కూల్, రైతుబజార్, భద్రకాళి దేవాలయం, మున్సిపల్ కార్యాలయం, రంగశాయిపేట, రంగంపేట, ఎంజీఎం క్రాస్ రోడ్ ప్రాంతంలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. వరంగల్‌లోని అబ్బనికుంట, ఈఎస్ఐ హాస్పిటల్, జాన్‌పీరీలు, నర్సంపేట రోడ్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు ప్రకటనల్లో తెలిపారు.

సీసీ రోడ్లకు ప్రతిపాదనలు

న్యూశాయంపేట : నగరంలోని 43వ డివిజన్ పరిధిలోని పలు కాలనీలతో పాటు శ్రీసాయినగర్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలకు జీడబ్ల్యూఎంసీ వర్క్ ఇన్స్‌పెక్టర్ వేణు ఆధ్వర్యంలో మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. సుమారు రూ.3 కోట్ల అంచనాతో సీసీ రోడ్డు కమ్ డ్రైనేజీల నిర్మాణానికి జీడబ్ల్యూఎంసీ ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించనున్నట్లు తెలిపారు.

నగదు జమచేయాలి

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత చేపపిల్లలకు బదులుగా మత్స్య సొసైటీల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నగదు జమచేయాలని టీఎంకేఎంకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం హనుమకొండ ములుగురోడ్ సమీపంలోని మత్స్యశాఖ కార్యాలయంలో జిల్లా మత్స్యశాఖ అధికారి నరేష్ నాయుడుకు 24 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

నియామకంపై హర్షం

కాజీపేట రూరల్ : తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా జి. కిషన్‌రెడ్డిని నియమించడంపై మంగళవారం స్థానిక బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నియామకంపై మాజీ కార్పొరేటర్ రామలింగం, నాయకులు అంకేశ్వరపు కుమార్, ఉడుతల బాబురావు, చాంద్‌పాషా, భగవాన్‌లు హర్షం వ్యక్తం చేశారు.

కాశిబుగ్గ: తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా జి.కిషన్‌రెడ్డి నియామకంపై రాష్ట్ర బిజెపీ కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు హర్షం వ్యక్తం చేశారు.

భూపోరాటాలు ఉధృతం చేస్తాం

- సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి



ఖిలావరంగల్ : దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రవి



మడికొండ: కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా కార్యదర్శి భిక్షపతి

ఖిలా వరంగల్: నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి వీరమరణం పొందిన దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో పేదల సంక్షేమం కోసం భూపోరాటాలు మరింత ఉధృతం చేస్తామని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. దిడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా మంగళవారం వరంగల్ శివనగర్‌లోని తమ్మెర భవనంలో జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్మియా ఆధ్వర్యంలో వర్ధంతి సభ జరిగింది. రవి హాజరై కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే గవిచర్ల క్రాస్ రోడ్డు జంక్షన్‌లో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి పార్టీ ఆధ్వర్యంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు రాచర్ల బాలరాజు, కోటేశ్వర్‌రావు హాజరై కొమురయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ల్యాదల్ల శరత్, సుధీర్, విక్టోరియా, దివ్య, పద్మ, సత్యం, వెంకట్రాది, యాకూబ్, మల్లారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

న్యూశాయంపేట : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని ఆయన స్ఫూర్తితో ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ పార్టీ కార్యాలయంలో కొంరయ్య వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, అనిల్‌కుమార్, ప్రణీత్, వేల్పుల చరణ్, అఖిల్, పవన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మడికొండ: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం దొడ్డి కొమురయ్య 77వ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కాజీపేట మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్, స్వామి, సుమన్, పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి 'ఎర్రబెల్లి' జన్మదిన వేడుకలు



వరంగల్ చౌరస్తా : స్వీట్లు పంపిణీ చేస్తున్న రాజనాల శ్రీహరి

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జన్మదిన వేడుకలను మంగళవారం కాకతీయ యూనివర్సిటీ గేట్ వద్ద కేయూ జేఏసీ వైస్ చైర్మన్ మేడారపు సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కేయూ బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, నాయకులు పి.కొమురయ్య, జెట్టి రాజేందర్, లంక రాజగోపాల్, అభిషేక, కలకోట్ల సుమన్, వీరూ, తిరుపతి, కుమారస్వామి, కార్తిక్, సంపత్, మొగిలి, నవనీత్, కేయూ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపెల్లి నరేష్ పాల్గొన్నారు.

వరంగల్ చౌరస్తా : రాష్ట్ర గ్రామీణ, నీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు 67 జన్మదిన వేడుకలను మంగళవారం వరంగల్ చౌరస్తాలో ఘనంగా జరుపుకున్నారు. శాప్ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకులు రాజనాల శ్రీహరి, మసూద్‌ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. సుమారు 100 మందికి వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు గంగాసానీ కృష్ణారెడ్డి, ఎంపీ తాహిర్, పోలెపాక ప్రసాద్, మట్టెవాడ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల ఎదుట ధర్నా



విద్యారణ్యపురి: హనుమకొండలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఓ పారామెడికల్ నర్సింగ్ కళాశాల నడుపుతున్నారని ఆరోపిస్తూ ఎస్ఎఫ్ఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొందరు విద్యార్థులు మంగళవారం ఆ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. నర్సింగ్‌లోని వివిధ కోర్సులు నడుపుతూ ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ సరిగా క్లాస్‌లను కూడా నిర్వహించటంలేదని ఆరోపించారు. సంబంధిత అధికారుల స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లాకార్యదర్శి మంద శ్రీకాంత్, సహాయ కార్యదర్శి స్టాలిన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్ కృష్ణ, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

పేదరికం చదువుకు ఆటంకం కాదు



న్యూశాయంపేట : విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న అనితారెడ్డి



మడికొండ : నోట్‌బుక్స్ అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

వరంగల్ చౌరస్తా : పేదరికం చదువుకు ఆటంకం కాదని ది జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర వైస్ చైర్మన్, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో వరంగల్ రామన్నపేట పడిశాల ఆంధ్ర బాలికల ప్రభుత్వ పాఠశాల పిల్లలకు విద్యార్థులకు నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినియోగదారుల రక్షణ, హక్కుల చట్టం 2019పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉన్నప్పుడే వాటిని వినియోగించుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ దేవా సాంబమూర్తి, జనరల్ సెక్రటరీ కరుకాల రామ్‌రెడ్డి, హెచ్‌ఎం వాణి ప్రియదర్శిని, శారద, రవి కుమార్, మెంబర్స్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట : విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని ఫెనిక్స్ సొసైటీ అధ్యక్షుడు జీతు జోన్ ఆకాంక్షించారు. కాజీపేట 61వ డివిజన్ వెంకటాద్రినగర్ కాలనీలో మంగళవారం సొసైటీ ఆధ్వర్యంలో బాక్ టు స్కూల్ విత్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా 50 మంది పేద విద్యార్థులకు నోట్‌పుస్తకాలతో పాటు స్టేషనరీ పంపిణీ చేశారు.

మడికొండ : స్థానిక మండల పరిషత్ పాఠశాలలో మంగళవారం 320 మంది విద్యార్థులకు 1700 నోట్‌బుక్స్‌ను లాడ్జ్ అభయ్‌రుద్ర 278 వరంగల్, ఫ్రీ మిషన్స్ చారిటబుల్ ట్రస్ట్ వారు సంయుక్తంగా యుకేజీ నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు బి.సంధ్యారాణి తెలిపారు. వితరణకు పలువురు దాతలు ముందుకు వచ్చి నోట్ బుక్స్‌ను అందజేశారు. పలువురి దాతలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

'విజయ సంకల్ప సభ'ను విజయవంతం చేయాలి



బీజేపీ ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న కొండేటి శ్రీధర్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

కాశిబుగ్గ : ఈనెల 8న హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ప్రధాని మోదీ పాల్గొనే విజయ సంకల్ప సభకు నగరం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం వారు ఓ సిటీలో జెండా ఊపి ప్రచార వాహనాలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధానిగా 9 సంవత్సరాల సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమకొండలో విజయ సంకల్ప సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంటా రవికుమార్, మంతెన ఆమరీష్, ఓం ప్రకాష్ కోలారియా, ఎరుకుల రఘునారెడ్డి, సురేందర్, నైనేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ చౌరస్తా : ఎస్సీ కులాల రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 7న చలో వరంగల్ ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ సభకు మాదిగలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ కోరారు. హనుమకొండ కంచరకుంటలో ఆవిర్భావ మహాసభ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు హర్షం రాజమౌళి, మారెపాక అనిల్, అలుకపెల్లి రాజుకుమార్, రామగిరి నాగరాజు, ఎనుముల రాకేష్, రాజేష్, రాంకుమార్, అనిల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గ : ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 7న ఓ సిటీ మైదానంలో జరిగే మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్పీ తూర్పు కో ఆర్డినేటర్ ఈర్ల కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కాశిబుగ్గ జంక్షన్‌లో సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు జన్ను మధుకర్, గంగారపు మల్లన్న, మంద రమేష్, చిన్ని, శాంసన్, భరత్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

ఖిలా వరంగల్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. డిజిటల్ విద్యలో భాగంగా మంగళవారం వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో పాఠశాల అధ్యక్షుడు, కార్పొరేటర్ మరుపల్లి రవి, కార్యదర్శి ఏరా కోటేశ్వర్, ప్రిన్స్‌పాల్ చిట్యాల సోమశేఖర్ ఆధ్వర్యంలో ప్రొజెక్టర్, టీవీని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నరేందర్ హాజరై ప్రొజెక్టర్ టీవీని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ సర్కారు విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో సదానందం, నాగేశ్వర్‌రావు, యాదగిరి, వనం కుమార్, చంద్రకళ, రజిత గౌతమ్,రాజు, గౌడ్ శ్రీను నర్సింహా రాజు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఆర్‌బీఐ క్విజ్ పోటీలు



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

విద్యారణ్యపురి: భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బిఐ) ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత–2023 అంశం జిల్లాస్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో పలువురు విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. హనుమకొండ జిల్లాలోని నారాయణగిరి జెడ్పీఎస్ఎస్ విద్యార్థులు జి. సంజీవ్, ఎ.అభిలాష్ మొదటి స్థానం సాధించారు. జెడ్పీఎస్ఎస్ మర్కజీ ద్వితీయ, పరకాల బాలికల పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ లీడ్‌బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, శరవణన్, కమ్యూనిటీ మొబలైజింగ్ కోఆర్డినేటర్ బి.రాధ, హెచ్‌ఎం జి ఉప్పలయ్య పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థులు ఈనెల 10న జరిగే రాష్ట్రస్థాయి క్విజ్‌పోటీల్లో పాల్గొనాలని అధికారులు సూచించారు. విజేతలకు బ్యాంకు అధికారులు సర్టిఫికెట్లు అందజేశారు. నారాయణగిరి విద్యార్థులను హెచ్‌ఎం డాక్టర్ బి రాంధన్, చైర్మన్ కరుణాకర్‌లు అభినందించారు.

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి



సునీతకు వినతిపత్రం ఇస్తున్న బీఎంఎస్ నేతలు

హన్మకొండ చౌరస్తా: భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో కనీస వేతన సలహా మండలి బోర్డు సూచించిన మేరకు అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.18,019 కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హనుమకొండలోని కార్మికశాఖ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సునీతకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం చట్టాలను సవరించి కనీస వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమణారెడ్డి, శశికుమార్, మల్లేషం, కరుణాకర్, ఎల్లమ్మ, సుధాకర్, ఎల్లమ్మ, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మడికొండ: పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగపురి ఉప్పలయ్యగౌడ్ (63) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా మందులు వాడుతున్నాడు. అయినా ఆరోగ్యం బాగా కాకపోవడంతో సోమవారం జీవితంపై విరక్తి చెంది, ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఉప్పలయ్యను భార్య కుమారుడికి సమచారం అందించి చికిత్స నిమిత్తం ఆటోలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు జగన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరికి జైలు

కాజీపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 23 మందిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి కె.విద్యాసాగర్‌రావు ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష, 21 మందికి రూ.42,200 జరిమానా విధిస్తూ తీర్పుచ్చినట్లు ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవళ్ల బాలకృష్ణరావు, గొల్లన తిరుపతిలకు జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

బాధిత కుటుంబాలకు 'కొండా' పరామర్శ

కాశిబుగ్గ : హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పత్తిపాక రోడ్డు సమీపంలో రోడ్డు ప్రమాదంలో కాశిబుగ్గ వీకర్స్ సెక్షన్ కాలనీకి చెందిన ఐదుగురు కుటుంబ సభ్యులు మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మంగళవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారికి అండగా ఉంటామని ధైర్యం చెప్పి రూ. 20 వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే ఇటీవల మృతిచెందిన భద్రయ్య కుటుంబ సభ్యులకు రూ. 5 వేల ఆర్థికసాయం అందజేశారు.

ట్రిపుల్ ఐటీకి మైనారిటీ విద్యార్థుల ఎంపిక

న్యూశాయంపేట : హన్మకొండ జిల్లా హంటర్‌రోడ్‌లోని తెలంగాణ మైనారిటీ గురుకులాల విద్యాసంస్థ హన్మకొండ-1 (బాలికల గురుకులం) విద్యార్థులు అయేషా తరుణమ్, ఎం.హరణీ, జి.అక్షితలు బాసరలోని ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు. విద్యార్థులను జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి మేన శ్రీను, ఆర్‌ఎల్‌సి-1, శ్రీపాల, విజిలెన్స్ అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఓ సిటీ వీరాంజనేయ, విశ్వేశ్వరస్వామి దేవాలయ కమిటీ

కాశిబుగ్గ : వరంగల్ ఓ సిటీలోని శ్రీవీరాంజనేయ, కాశీవిశ్వేశ్వరసామి దేవాలయ కమిటీ చైర్మన్‌గా ఓ సిటీకి చెందిన కంచ సంపత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయానికి ఆరుగురు సభ్యులతో ధర్మకర్తల మండలి ఏర్పాటు చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ గత నెల 26న ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం దేవాలయ ప్రాంగణంలో ధర్మకర్తల మండలి సమావేశమై చైర్మన్‌గా సంపత్, సభ్యులుగా ఆవుల రమేష్, గనిపాక అమరావతి, నర్సింగోజు నర్సింహాచారి, పద్మా గంగాధర్, ఎక్స్‌అఫీషియో సభ్యులుగా అర్చకులు చింతపాటి శశిధర్‌లను ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఏడాది పాటు కొనసాగుతుందని ఉత్తర్వుల్లో దేవాదాయ శాఖ పేర్కొంది. అనంతరం ఎమ్మెల్యే నరేందర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

'పింగిళి' విద్యార్థినికి గౌహతిలో ప్రవేశం

హన్మకొండ అర్బన్ : హనుమకొండ వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ ఫైనలియర్ పరీక్షలు రాస్తున్న నగరానికి చెందిన ఓరుగంటి తేజస్వికి గౌహతి ఐఐటీలో ఎంఏ డెవలప్‌మెంట్ స్టడీస్, లిబరల్ రెండు కోర్సుల్లో ప్రవేశం లభించింది. అయితే తేజస్వీ తనకు ఆసక్తి ఉన్న డెవలప్‌మెంట్ స్టడీస్‌లో చేరనున్నట్లు తెలిపారు. తేజస్విని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, కంట్రోలర్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, పుష్పగుచ్ఛం, శాలువాతో కళాశాలలో సత్కరించారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

కాజీపేట రూరల్ : విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని, యువత ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో చేరడంతో దేశభక్తి, క్రమశిక్షణ, అలవడుతుందని 10వ బెటాలియన్ ఆర్మీ సుబేదార్ మేజర్ సుహాస్ కదమ్ అన్నారు. కాజీపేట సెయింట్ గాబ్రియల్స్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థుల నాయకత్వ ప్రతిజ్ఞా స్వీకారోత్సవం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ జి.గోపినాథ్, ఆంధ్రా బ్యాంక్ రిటైర్ట్ మేనేజర్ రియాజుద్దీన్, బాలికల ప్రతినిధి కె.దీపాలి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.

మహనీయుల వర్ధంతి

హన్మకొండ : హనుమకొండ హనుమాన్ నగర్‌లో మంగళవారం యువతకు ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద 121 వర్ధంతి, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని జరుపుకున్నారు. ముందుగా వారి చిత్రపటాలకు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్లా వెంకటేశ్వర్ రెడ్డి, స్థానికులు పూల మాల వేసి నివాళులు అర్పించారు.

ఏకలవ్య కమ్యూనిటీ హాల్ నిర్మాణం

కాశిబుగ్గ : గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ కాశిబుగ్గలో రూ.70 లక్షల నిధులతో ఏకలవ్య కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణం చేస్తున్నట్లు మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్ అన్నారు. మంగళవారం ఆయన నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న ఏకలవ్య కమ్యూనిటీ హాల్ శిథిలావస్థలో ఉన్న పరిస్థితిని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ దృష్టికి తీసుకవెళ్తే వెంటనే అయన స్పందించారు.

దేశ సుస్థిరతకు ఉమ్మడి పౌరస్మృతి అవసరం

నయీంనగర్: దేశ సమగ్రత, సుస్థిరతకు ఉమ్మడి పౌరస్మృతి అవసరమని రాజ్యాంగకర్తలు అభిప్రాయపడ్డారని జాగృతి ట్రస్ట్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ చిలకమూరి సంజీవరావు తెలిపారు. మంగళవారం హన్మకొండ ప్రెస్‌క్లబ్‌లో ఉమ్మడి పౌరస్మృతిపై జాగృతి ప్రత్యేక సంచికను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుళ మతాలు, వైవిధ్య ఆచారాలు కలిగిన భారతదేశంలో చట్టాన్ని చక్కగా అమలుచేయాలంటే ఉత్తమ మార్గం ఉమ్మడి పౌరస్మృతి చట్టం మాత్రమే అన్నారు. సమావేశంలో హన్మకొండ జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వై.శ్యాంసుందర్‌రెడ్డి, తెలంగాణ న్యాయవాద పరిషత్ కార్యదర్శి సంసాని సునీల్, వరంగల్ ఉమ్మడి జిల్లా న్యాయవాద పరిషత్ అధ్యక్షుడు చొల్లేటి రామకృష్ణ, మాతంగి రమేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నయీంనగర్: వరంగల్ నగర పరిధిలోని అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి అందించాల్సిన నివేశన స్థలాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సిక్స్‌మెన్ కమిటీ తెలిపింది. మంగళవారం జరిగిన సమావేశంలో కన్వీనర్ బీఆర్ లెనిన్, కో కన్వీనర్లు బి.దయాసాగర్, వేముల నాగరాజు, సభ్యులు గడ్డం రాజిరెడ్డి, బొల్లారపు సదయ్య, ఎం.సుధాకర్ పాల్గొన్నారు. ఏకశిల, కాకతీయ హౌసింగ్ సొసైటీల్లో సభ్యులుగా లేని జర్నలిస్టులు జూలై 5, 6వ తేదీల్లో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో పూరించిన దరఖాస్తులు ఇవ్వాలని కమిటీ కోరింది. ఐదేళ్లకు పైగా అనుభవం ఉన్న వారు పూర్తి సమాచారంతో అనుభవాన్ని ధ్రువపరిచే జిరాక్స్ ప్రతులను దరఖాస్తులకు జతచేసి ఇవ్వాలన్నారు. అనుభవాన్ని ధృవపరిచేందుకు పనిచేస్తున్న సంస్థల ఇన్‌చార్జ్‌ల అటెస్టేషన్ లేదా రూ.20 బాండ్ పేపర్‌పై సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. తుది నిర్ణయం కమిటీ సభ్యులకు ఉంటుందని కమిటీ స్పష్టం చేసింది.

సమస్యలు పరిష్కరించాలి

రామన్నపేట : వరంగల్ మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని ఏఐఎస్‌బీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వరంగల్ ఎంఈఓకు అందించారు.

రేపు పాలకమండలి ప్రమాణ స్వీకారం

వరంగల్ చౌరస్తా : చరిత్రకు నిలయమైన వరంగల్ నగరంలో గోవిందాద్రి కొండపై స్వయంభుగా వెలసినదేవి భూదేవి నీలాదేవి సతీసమేతుడైన గోవిందరాజ స్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకారం గురువారం సాయంత్రం జరగనుంది. ముఖ్య అతిథిగా తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, కార్పొరేటర్ చింతాకుల అనీల్‌కుమార్ పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. అంతేకాకుండా దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు హాజరవుతారని ఈవో వై.రత్నాకర్‌రెడ్డి తెలిపారు.

చైర్మన్‌గా సత్యనారాయణ

గోవిందరాజ స్వామి పాలకమండలి చైర్మన్‌గా సోమరాతి సత్యనారాయణ నియమితులయ్యా రు. పాలకమండలి సభ్యులు చకిలం ఉపేందర్, బిర్లా గోపాల్ లహోటి, చింతాకుల రాజకృష్ణ, కుమారి పట్టాభి రాజరాజేశ్వరి, ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాస స్వామిలు కమిటీ ఏర్పాటు చేశారు.

కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నా

కేయూ క్యాంపస్ : తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఫార్మసీ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కుక్టా బాధ్యులు టి.నాగయ్య, చందులాల్, సంగీత్‌కుమార్, కృష్ణ, నర్సింహులు, భిక్షపతి, మధుకర్‌రావు, కల్పన, స్వప్న, పాల్గొన్నారు. కేయూలోని పార్ట్‌టైం లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ బాధ్యులు మంగళవారం క్యాంపస్‌లో వీసీ ఆచార్య తాటికొండ రమేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

విద్యార్థులకు వోపాస్ ప్రతిభాపురస్కారాలు

హన్మకొండ కల్చరల్ : ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు వోపాస్ ప్రతిభా, నగదు పురస్కారాలు అందజేస్తామని వరంగల్ జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అభ్యుదయ సంఘం (వోపాస్) అధ్యక్షుడు సిద్దోజు విద్యాసాగర్ తెలిపారు. మంగళవారం సుబేదారిలోని వోపాస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదివిన 10వ తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జిరాక్సు ప్రతులను ఇ.నెం. 2-4-1469 మొదటి అంతస్తు, అశోక కాలనీ రోడ్ నెం.6, హన్మకొండ, చిరునామాకు పోస్టు ద్వారా గానీ స్వయంగానీ 2023 జూలై 21లోగా అందజేయాలని తెలిపారు. వివరాలకు 94929 09921, 91541 02640 సెల్ నంబర్ల ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు గురుబ్రహ్మం, వేల్పుల దేవాచారి, సదానందచారి పాల్గొన్నారు.